
ప్రజాశక్తి
ఆదివారం 4 ఏప్రిల్ 2025
పార్వతీపురం మన్యం



జిల్లాలో భారీగా పోలీసుల బదిలీ



ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా 74మంది పోలీస్ సిబ్బందిని వివిధ పోలీస్ స్టేషన్లకు బదిలీలు చేశారు. ఈ మేరకు శనివారం జిల్లా ఎస్పి ఎస్వి మాధవ్ రెడ్డి ఉత్తర్వుల విడుదల చేశారు. జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్లలో గత ఐదు సంవత్సరాల పైబడి పని చేస్తున్న, సిబ్బందిని సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా బదిలీ చేశారు. మొత్తం 74 మందిలో 4 గురు ఎఎస్ఐలకు, 24 మంది హెడ్ కానిస్టేబుళ్లకు, 26 మంది కాని స్టేబుళ్లకు బదిలీలు జరిగాయి.

నిరంతర పోరాటమే శ్రీరామ్మూర్తికి నివాళి

- ప్రాథమిక హక్కులపై మోడీ ప్రభుత్వ దాడులను తిప్పికొట్టాలి
- ఆర్ఎస్ఎం నాలుగో వర్థంతి సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.సుబ్బరావమ్మ

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రజా ఉద్యమాల పట్ల నిరంతరం శ్రమిస్తూనే, కార్మిక, రైతాంగ వర్గానికి వెన్నుదన్నుగా నిలుస్తూ, విశాల ఐక్య ఉద్యమాలకు ఊపిరి పోసిన శ్రీరామ్మూర్తికి ప్రజాసమస్యలపై నిరంత పోరాటాలతోనే నిజమైన నివాళి సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.సుబ్బరావమ్మ అన్నారు.

సిపిఎం జిల్లా పూర్వ కార్యదర్శి రెడ్డి శ్రీరామ్మూర్తి నాలుగో వర్థంతి సందర్భంగా శనివారం స్థానిక ఎన్జీవో హోంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.రామస్వామి అధ్యక్షతన సభ జరిగింది. ముందుగా రెడ్డి శ్రీరామ్మూర్తి చిత్రపటానికి సుబ్బరావమ్మతో పాటు పార్టీ సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి, ఎపి ఎపి ఎన్జిఒ జిల్లా కన్వీనర్ గంటా కిశోర్ కుమార్ శ్రీరామ్మూర్తి సతీమణి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రెడ్డి శ్రీదేవి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు, జిల్లా కమిటీ సభ్యులు గొర్లి.వెంకటరమణ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సుబ్బరావమ్మ మాట్లాడుతూ శ్రీరామ్మూర్తి త్యాగమూర్తి అని, తన చదువు అనంతరం ఉద్యోగాన్ని, కుటుంబ స్వప్రయోజనాన్ని పక్కన పెట్టి నిరుద్యోగ సమస్యలపై పోరాడేందుకు డివైఎఫ్ఐ సంఘ నాయకుడుగా సమాజానికి పరిచయమై, నేడు ఒక వ్యవస్థ మొత్తానికి నాయకుడుగా నిలవడం అనేది కొంతమందికే సాధ్యమని, అందులో శ్రీరామ్మూర్తి నిలవడం గొప్ప విషయమని అన్నారు.

దేశంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగంలో పౌరులకు కల్పించిన ప్రాథమిక హక్కులపై దాడులు ఎవరు చేసినా తప్పేనని చెప్పారు. ముస్లింల ఆస్తుల పరిరక్షణకు సంబంధించిన వక్ఫ్‌చట్టాన్ని మోడీ ప్రభుత్వం సవరించి ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు కుట్రలు చేస్తోందని విమర్శించారు దేశంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త కంపెనీలేవీ స్థాపించలేదని, నిరుద్యోగ సమస్య తారాస్థాయికి చేరిందని చెప్పారు. గత పదేళ్లలో అనేక కంపెనీలు మూతపడ్డాయని చెప్పారు. దశాబ్దాల క్రితం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను మోడీ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. వీటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను అమల్లోకి తీసుకొచ్చిందన్నారు. క్రిమినల్ చట్టాలను తెరిచారన్నారు. ఇటువంటి చట్టాలతో హక్కులను హరించేందుకు కుట్ర పన్నుతున్నారని, వాటిని తిప్పికొట్టాలని అన్నారు.

సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కష్ణమూర్తి మాట్లాడుతూ నిరంతర పోరాటాలు, ఉద్యమాలు చేసే నాయకుడు రెడ్డి శ్రీరామ్మూర్తి అని అన్నారు. ఆయనంటే ఒక భరోసా, విశ్వాసం వుండేదని చెప్పారు. ఆయన లేని లోటు పూడ్చలేనిదని చెప్పారు. ఏదైనా సమస్యపై పోరాడితే పరిష్కారమయ్యేంత వరకు పని చేసేవారని చెప్పారు. నమ్మిన సిద్ధాంతం కోసం ఆఖరి దాకా పోరాడారని చెప్పారు. ఆయన ఆదర్శాలను అనుసరించడమే ఆయనకు అసలైన నివాళి అని అన్నారు. ఉమ్మడి జిల్లాలో శ్రీరామ్మూర్తి అనేక పోరాటాలకు ఆసరాగా నిలిచారని, శ్రీరామ్మూర్తి ఉద్యమ స్ఫూర్తితో భవిష్యత్తు ఉద్యమాలను, కార్యకర్తలను రూపదిద్దాలని కోరారు. నిత్యం ప్రజలతో కలిసి ఉంటూ వారిని చైతన్యపర్చడమే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పని చేయాలని సూచించారు.

ఎపి ఎన్జిఒ జిల్లా కన్వీనర్ గంటా కిశోర్‌కుమార్ మాట్లాడుతూ రెడ్డి శ్రీరామ్మూర్తి మరణించి నాలుగేళ్లయినా ఈ ప్రాంత ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి పోయారని చెప్పారు. సమస్యల పరిష్కారానికి ఆయన చూపిన చొరవ మరువలేనిదని చెప్పారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు మాట్లాడుతూ నిత్యం చిరునవ్వుతో ఉంటూ పోరాటం చేసే నాయకుడు రెడ్డి శ్రీరామ్మూర్తి అని అన్నారు

ఐద్వా నాయకులు, శ్రీరామ్మూర్తి సతీమణి రెడ్డి శ్రీదేవి మాట్లాడుతూ శ్రీరామ్మూర్తి తన కుటుంబం కన్నా పేదలనే ఎక్కువగా ప్రేమించారని చెప్పారు. కరోనా సమయంలో ఉపాధి కోల్పోయిన పేదల కోసం ఎక్కువగా పరితపించారన్నారు. భౌతికంగా ఆయన మాతో లేకపోయినా ప్రజలందరి గుండెల్లో చిరకాలం నిలిచిన వ్యక్తిగా నేడు ఉన్నారని అన్నారు.

కార్యక్రమంలో సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి, పి.రాజశేఖర్, బివి రమణ, మద్రిశ్రీను, బంటుదాసు, పి.సన్యాసిరావు, వై.మన్మధరావు, రెడ్డి లక్ష్మునాయుడు, రెడ్డి ఈశ్వరరావు, కె.సీతారాం, గంటా జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



శ్రీరామ్మూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు



వర్థంతి సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు కె.సుబ్బరావమ్మ, సీనియర్ నాయకులు కృష్ణమూర్తి, ఎన్జీవో అసోసియేషన్ జిల్లా కన్వీనర్ కిశోర్‌కుమార్

రాజకీయ క్రీ(నీ)డలో పార్వతీపురం

- 3 నెలలుగా నిర్వహించని మున్సిపల్ సమావేశాలు
- చైర్‌పర్సన్ డిమాండ్‌ను పట్టించుకోని కమిషనర్
- ఎమ్మెల్యే కనుసన్నల్లో మున్సిపల్ యంత్రాంగం

ప్రజాశక్తి - పార్వతీపురం

రాజకీయ క్రీనీడలో పార్వతీపురం మున్సిపాలిటీ కొట్టుమిట్టాడుతోంది. ప్రజాసమస్యలను గాలికొదిలేసిన అధికార, ప్రతిపక్ష పార్టీలు ఆధిపత్యం కోసం ఆరాటపడుతున్న పరిస్థితి కనిపిస్తోంది. గడచిన మూడు నెలలుగా మున్సిపల్ సాధారణ సమావేశాలు నిర్వహించడం లేదు. బడ్జెట్ సమావేశం కూడా నిర్వహించలేని స్థితిలో పురపాలకులు ఉన్నారు. వేసవిలో తీవ్ర తాగునీటి సమస్యను పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్నా రాజకీయ ప్రయోజనాలే పరమావధిగా ప్రధాన పాలక పార్టీలు ఎత్తుకు పై ఎత్తులు వేసుకునే పనిలో నిమగ్నమయ్యాయి. మున్సిపాలిటీలో గత నాలుగేళ్లుగా వైసిపి పాలకవర్గం పాలిస్తోంది.



రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తోంది. దీంతో మున్సిపాలిటీలో వైసిపి పాలకవర్గంపై అవిశ్వాస తీర్మానానికి టిడిపి పావులు కదిపింది. నెలరోజుల క్రితం మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరిపై ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర నాయకత్వంలో టిడిపి కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానానికి సంబంధించిన నోటీసును అందజేశారు. అయితే అవిశ్వాస నోటీసు సరైన ఫార్మాట్‌లో సమర్పించకపోవడంతో అది తిరస్కరణకు గురైంది. అధికారపార్టీ నాయకుల అవగాహనా లోపం కారణంగా అవిశ్వాస తీర్మానం నోటీసును లోపభూయిష్టంగా అందజేశారనే వాదనలు వినిపిస్తున్నాయి. అవిశ్వాసం ప్రతిపాదనకు మొత్తం కౌన్సిలర్లలో 20 మంది కౌన్సిలర్ల మద్దతు వుండాలని మున్సిపల్ చట్టం చెపుతున్నా అధికారపార్టీ నాయకులు 18మంది కౌన్సిలర్ల సంతకాలతో నోటీసును అందజేశారు. ప్రస్తుతం మున్సిపాలిటీలో వైసిపికి 14మంది, టిడిపికి 16మంది కౌన్సిలర్లు ఉన్నారు. మరోసారి అవిశ్వాస తీర్మానం నోటీసు అందజేయడానికి టిడిపి నాయకులు తెరవెనుక ప్రయత్నాలు చేస్తున్నారు. మరో నలుగురు వైసిపి కౌన్సిలర్లను టిడిపిలోకి తీసుకునేందుకు పావులు కదుపుతున్నారు.

సమావేశం నిర్వహించాలని వైసిపి డిమాండ్

మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించాలని గత కొద్దిరోజులుగా చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైసిపికి చెందిన కౌన్సిలర్లు డిమాండ్ చేస్తున్నారు. కమిషనర్ వెంకటేశ్వర్లును కలిసి సమావేశం నిర్వహించాలని కోరుతున్నారు. చైర్ పర్సన్ కనుసన్నల్లో పని చేయాల్సిన కమిషనర్ ఆమె సిఫార్సులను పట్టించుకోవడం లేదు. దీంతో ఆమె వైసిపి కౌన్సిలర్లతో కలిసి జెసి ఎస్ఎస్ శోబికకు కమిషనర్‌పై పిర్యాదు చేశారు. కమిషనర్‌ను మార్చారని డిమాండ్ చేశారు.

టిడిపి చట్రంలో కమిషనర్!

స్థానిక మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు పూర్తిగా టిడిపి చట్రంలో ఇరుక్కున్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర కనుసన్నల్లో ఆయన పని చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మున్సిపల్ సమావేశం నిర్వహించకుండా టిడిపి నాయకులు అడ్డుచక్రం వేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ఒకవైపు అధికారపార్టీ నాయకుల ఒత్తిళ్లు, మరోవైపు చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి, వైసిపి కౌన్సిలర్ల బెదిరింపుల మధ్య కమిషనర్ వెంకటేశ్వర్లు నలిగిపోతున్న పరిస్థితి ఏర్పడింది. వరుసగా మూడు నెలల పాటు మున్సిపల్ సమావేశాలు నిర్వహించకపోతే పాలక వర్గాన్ని రద్దు చేసే అవకాశం వున్నట్లు తెలుస్తోంది. దీని కోసమే టిడిపి నాయకులు వ్యూహాత్మకంగా మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించకుండా అడ్డు చక్రం వేస్తున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది.

అటవీ అనుమతుల కోసం పరిశీలన

ప్రజాశక్తి కొమరాడ

రిజర్వాయర్ ఫారెస్ట్‌లో ప్రభుత్వం రోడ్డు నిర్మాణాలకు సంబంధించి అనుమతులు కోసం పరిశీల చేస్తున్నట్లు డిఎఫ్ఒ ప్రసూన తెలిపారు. మండలంలో సర్పపాడు, కొండకూనేరు రహదారిని శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ రహదారి నిర్మాణానికి అవసరమైన అటవీ అనుమతుల కోసం ఇంజినీరింగ్ అధికారులు ప్రతిపాదనలు పంపినందున పరిశీలిస్తున్నట్టు తెలిపారు. ఈ రహదారి రిజర్వుఫారెస్ట్‌లో నిర్మించాల్సి ఉన్నందున ఉన్నతాధికారులకు నివేదిక అందించి, తద్వారా అనుమతులు మంజూరు జరుగుతాయన్నారు. ఫారెస్ట్ భూముల్లో రోడ్డు వేయాలంటే రాష్ట్ర స్థాయి నుంచి ఫారెస్ట్ అనుమతులు తప్పనిసరి ఉండాలని ఈ మేరకు పరిశీలనకు వచ్చి నివేదికలో ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు. పరిశీలనలో అటవీ శాఖ ఫారెస్ట్ మహీంద్రా, గార్డ్ సత్యనారాయణ, ఇంజినీరింగ్ సిబ్బంది ఉన్నారు.



అటవీ భూములను పరిశీలిస్తున్న డిఎఫ్ఓ ప్రసూన

అంగన్వాడీల సమ్మె నోటీసు

ప్రజాశక్తి - పాలకొండ

కేంద్రప్రభుత్వం అమలు చేసిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం స్థానిక సిడిపిఒ సింహాలమ్మకు అంగన్వాడీలు సమ్మె నోటీసు అందించారు. మే 20న దేశవ్యాప్త సమ్మెలో భాగంగా తాము కూడా పాల్గొంటున్నట్లు తెలిపారు. అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులకు గుర్తించాలని, కనీసం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మినీ సెంటర్లను మెయిన్ కేంద్రాలుగా మార్చాలన్నారు. బాల సంజీవని యాప్‌లో మార్పు చేయాలన్నారు. సమ్మె నోటీసు ఇచ్చిన వారిలో ప్రాజెక్ట్ అధ్యక్షులు జెస్సి బాయి, ఎన్.హిమప్రభ, పి.శారద, పి.లక్ష్మి, ఎం.శ్రీదేవి, ఎం.శ్యామల తదితరులు ఉన్నారు.

సమ్మె నోటీసును అందజేసిన మున్సిపల్ కార్మికులు

సాలూరు : ఈనెల 20న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొంటామని సాలూరు మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఫెడరేషన్ కమిటీ సమ్మె నోటీసును మున్సిపల్ కమిషనర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు మున్సిపల్ కార్మికులు సిబ్బంది శనివారం అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు శంకర్, రాముడు మాట్లాడుతూ కార్మికవర్గాన్ని కట్టుబానిసలుగా చేసే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. కాంట్రాక్ట్, అవుట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, స్వాతంత్ర్యం రాకముందు ప్రాణాలు త్యాగం చేసి సాధించుకున్న హక్కులను కాలరాస్తున్నారన్నారు. ట్రేడ్ యూనియన్, వేతనాలు చట్టం, బోనస్ గ్రాడ్యుటీ, పిఎఫ్ ఇఎస్ఐ 29 చట్టాలను బిజెపి ప్రభుత్వం లేబర్ కోడ్‌గా మార్చిందన్నారు. ఉద్యోగవిధానంలో ఫిట్టర్మెంట్ ఎంప్లాయ్ విధానం, ప్రమాదకర లేబర్ కోర్టును రద్దు చేయాలని, అన్నిరకాల సంఘాలు కార్మికులు కలిసి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా జరిగిన సమ్మెలో పాల్గొంటామని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయ్ యూనియన్, కార్మికులు నోటీసులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు శ్రీను, రవి, మధు ఈశ్వరరావు, శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.



పాలకొండలో సిడిపిఒకు సమ్మె నోటీసు అందజేస్తున్న అంగన్‌వాడీలు

గురజాడను విస్మరించడం తెలుగు జాతికే అవమానం




ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

మహాకవి గురజాడ వెంటక అప్పారావును రాష్ట్ర ప్రభుత్వం విస్మరించడం తెలుగు జాతికే అవమానకరం. దీనిపై ఉత్తరాంధ్రాలోని సాహితీలోకం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ఇదేదో మామూలుగా మర్చిపోయిన విషయం కాదని, పాలకులు ఉద్దేశ పూర్వకంగానే అభ్యుదయ భావాలను, చరిత్ర రాసిన కవులు, సాహితీవేత్తలు, కళాకారులను విస్మరించినట్టుగా భావించాలని వ్యాఖ్యానిస్తున్నారు. ప్రజాకవి గంటేడ గౌరు నాయుడు రాసిన పాడుదమా స్వేచ్ఛాగీతం పాటల పుస్తకాన్ని ఇటీవల జిల్లా పరిషత్ వేదికగా ఆవిష్కరించిన సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమానికి హాజరైన కవులు, కళాకారులు, సాహితీవేత్తలు, సాహితీ ప్రియులంతా కవి గురజాడను ప్రభుత్వం విస్మరించడాన్నీ తీవ్రంగా తప్పుపట్టారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఉత్తరాంధ్రతోపాటు ఇతర జిల్లాలకు చెందిన వారు కూడా ఇదే విషయాన్ని చర్చించుకున్నారు. దేశమును ప్రేమించమన్న... మంచి అన్నది పెంచుమన్నా అంటూ మన దేశ స్వతంత్ర పోరాటానికి ముందే దేశభక్తిని ఉప్పొంగించారు గురజాడ. దేశమంటే మట్టికాదోయ్... దేశమంటే మనుషులోయ్... అని కూడా ఉద్బోధించారు. గురజాడ, గిడుగు, కందుకూరి లేని తెలుగు సంస్కృతి, సాంస్కృతిక పునర్వికాశం లేదంటే అతిశయోక్తి కాదు. అందుకే గురజాడను తెలుగుజాతి తన హృదయానికి హద్దుకుంది. ఇంతటి గురజాడ పేరును ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన మహనీయుల వర్ధంతులు, జయంతుల జాబితాలో చేర్చలేదు. ఇది ముమ్మాటికీ తెలుగు జాతిని అవమానించినట్లేనని సాహితీలోకం ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఇంతే కాదు సుమారు ప్రభుత్వం ప్రకటించిన 23 ప్రముఖుల్లో రామాయణం రాసిన మొల్ల మినహా మరే మహిళలకు కూడా స్థానం దక్కలేదు. కూటమి ప్రభుత్వ పెద్దలు ఇటీవల సనాతన ధర్మం అనే కొత్తపల్లవి అందుకోవడం వల్లే ఇలా జరిగిందా? అన్న సందేహాలు కూడా వ్యక్తమౌతున్నాయి. సమాజాన్ని వెనక్కినెడుతున్న బాల్య వివాహాలు, సతీసహగమనం వంటి సామాజిక దురాచారాలను కవి గురజాడ తన కలంతో ప్రశ్నించాడు. ఎల్లలోకమునొక్క ఇళ్లై... వర్ణభేదములెల్ల కళ్లై.... అంటూ కులమతాల పేరిట కుమ్ములాడుకోకుండా అంతా ఒక్కటై ఉండాలనే 150ఏళ్ల క్రితమే బోధించారు. బహుసా అటువంటి రచనలు నేటి పాలకులకు మింగుడు పడడం లేదోమో. అందుకే గురజాడను మహానుభావుల జాబితాలో చేర్చలేదోమే అంటూ సాహితీలోకం చర్చించుకుంటోంది. పాలకుల సంకుచిత ఆలోచనలను వదిలించేందుకు 'మంచి గతమున కొంచెమోనేయ్... మందగించక ముందుకు నడవోయ్... అని గురజాడ అడుగు జాడ చూపించారు. ఇలా చెప్పుకుంటూ పోతే నేడు మన దేశాన్ని పట్టిపీడిస్తున్న మతోన్మాదం, ఉగ్రవాదం, కులమతాల పట్ల మనం ఎలా మెలగాలో కూడా చాటిచెప్పిన గురజాడను గుర్తించికపోవడం నిజంగా తెలుగు జాతికి అవమానమేనన్న చర్చ ముమ్మరంగానే సాగుతోంది. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే తన పొరపాట్లను సరిదిద్దుకోవాలని కోరుతున్నారు.

ఈనెలా కందిపప్పు లేనట్టే!

అరకొరగా సరుకులు పంపిణీ



ప్రజాశక్తి - సాలూరురూరల్

కూటమి ప్రభుత్వంలో సామాన్యుడు ముడుపూటలా కడుపు నింపుకోవడానికి నానా అవస్థలు పడుతున్నాడు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే చౌక దుణాకాల ద్వారా క్రమం తప్పకుండా ప్రతి నెలా ప్రతి కార్డుదారునికి అన్ని రకాల నిత్యావసర సరుకులను రాయితీ ద్వారా అందజేస్తామని ఊరు వాడా దండోరా వేసి మరీ చెప్పారు. తీరా అధికారంలోకి వచ్చాక నిత్యావసర సరుకుల ధరలు చూసి సామాన్యుడు వీరి నిర్వహకం చూసి బెంబేలెత్తిపోతున్నాడు. నిత్యవసరాల సరుకుల్లో ప్రధానమైన కందిపప్పు ధరలు బాగా పెరిగిపోయాయి. ప్రభుత్వం పౌరసరఫరాల శాఖా ద్వారా పంపిణీ చేసే కంది పప్పును వినియోగించుకుందామని రేషన్ కార్డుదారులు ఆశ పడుతుంటే ప్రభుత్వం వారి ఆశలపై నీళ్లు జల్లింది. ఈ ఏడాది జనవరిలో కొద్దిగా తెప్పించి, కొద్ది మందికి మాత్రమే పంపిణీ చేశారు. ఫిబ్రవరి, మార్చిలో కందిపప్పు ఇస్తారేమోనని కార్డుదారులు ఎంతో ఆశ పడ్డారు. ఏప్రిల్‌లో ఇస్తారేమోనని ఎదురు చూశారు. కానీ ఆ నెలలోనూ నిరాశే ఎదురైంది. దీంతో కార్డుదారులు మండిపడుతున్నారు. బయట మార్కెట్‌లో కిలో కందిపప్పు రూ.150 నుంచి రూ.170 వరకు పలుకుతుంది. ఇంత ధర పెట్టి కొనుగోలు చేయలేక పప్పులను తినడమే మర్చిపోయారు. ప్రభుత్వం ఎండియు వాహనాల ద్వారా కిలో రూ.67కు ఇస్తుండడంతో ప్రభుత్వం అందజేసే కందిపప్పు మీద ఆశ పడ్డారు. ఇప్పుడు మాత్రం కందిపప్పు ఊసే లేకపోవడంతో లబ్ధిదారులు లబోదిబో మంటున్నారు. ప్రభుత్వం వచ్చి కొద్దినెలలు కందిపప్పును పంపిణీ చేశారు. అనంతరం చేతిలేత్తేయడంతో పేద, మధ్యతరగతి ప్రజలు నిరాశ చెందుతున్నారు.

ప్రతినెలా బియ్యం, పంచదారతో సరిపెట్టేస్తున్నారు

ప్రతి నెలా రేషన్ కార్డుదారులకు కేంద్ర ప్రభుత్వం ద్వారా వచ్చే ఉచిత బియ్యం మాత్రమే అందజేస్తున్నారు. కూటమి నాయకులు గత ఎన్నికల సందర్భంగా ప్రజలకు రేషన్ షాపుల ద్వారా అన్ని రకాల పప్పు దినుసులను రాయితీ ద్వారా అందజేస్తామని చెప్పారు. 2014-19 మధ్యలో టిడిపి సంక్రాంతి కానుక, ముస్లింలకు రంజాన్ తోఫా, క్రిస్టియన్స్‌కు క్రిస్మస్ కానుక అనే పథకాలను అందజేసేవారు. ఎన్నికల హామీగా ప్రతి పండగకు కానుకలు అందజేస్తామని చెప్పారు. కూటమి నాయకులు చెప్పే విధంగా కానుకలు మాట దేవుడెరుగు ఉన్న సరుకులు ఇస్తే చాలన్న రీతిలో కార్డుదారులు ఉన్నారు. అయినా రేషన్ షాపుల ద్వారా అందజేసే సరుకుల్లో కోత పెట్టి అందజేయడంతో పేద, మధ్యతరగతి ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి హామీలను తీర్చకపోవడంతో ప్రజలు పెదవిరుస్తున్నారు. అందులో ప్రధానమైనది నిత్యవసర సరుకులను కూడా పౌరసరఫరాల ద్వారా సక్రమంగా అందజేయడం లేదని, దీని ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. రోజురోజుకు ధరలు పెరిగిపోతుండడంతో రోజువారీ కూలీలు, పేదలు, మధ్యతరగతి ప్రజలు వారికి వచ్చే సగటు ఆదాయంతో నానా అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం కనీసం తినడానికి నిత్యవసర వస్తువులను రేషన్ షాప్‌ల ద్వారా అందజేస్తారన్న ఆశతో ఎదురుచూడడమే తప్ప ఇప్పటి వరకు ఎటువంటి సరుకులు అందజేయడం లేదని కార్డుదారులు వాపోతున్నారు.

కొన్ని రకాల వస్తువుల్ని ఇచ్చి చేతులు దులుపుకుంటున్న ప్రభుత్వం

బియ్యం, పంచదార తదితర వస్తువులు ఇచ్చి ప్రభుత్వం చేతులు దులుపుకుంటుంది. మిగతా వస్తువులు ఇవ్వకపోతే పేదలు ఎలా బతుకుతారు. ప్రభుత్వాలు పేదలకు ఇదేనా మేలు చేసే విధానం

జట్ల అప్పలస్వామి, నందేడవలస

అన్ని రకాల సరుకులు ఇచ్చి ఆదుకోవాలి

పేద, మధ్యతరగతి ప్రజలకు ప్రభుత్వం పౌరసరఫరాల శాఖ ద్వారా అన్ని రకాల నిత్యవసర వస్తువును అందజేసి పేదల ఆకలి తీర్చేలా కృషి చేయాలి. అంతేగాని పేదలకు ఇవ్వాల్సిన రాయితీలను పెత్తందారులకు ఇచ్చి మా కడుపు కొట్టడం ఎంతవరకు సబబు. ఇకనైనా ప్రభుత్వాలు పేదలకు ఇవ్వాల్సిన రాయితీలను సక్రమంగా ఇచ్చిలా చర్యలు తీసుకోవాలి.

గనుతురి స్వప్న, పూలవలస.

జూన్, జులైన నుంచి కందిపప్పు అందజేస్తాం

గత కొన్ని నెలల నుంచి కందిపప్పును అందజేయకపోవడం వాస్తవమే. పైనుంచి విడుదల చేయకపోవడంతో ఇక్కడి లబ్ధిదారులకు ఇవ్వలేకపోతున్నాం. తొందర్లోనే జూన్, జూలై నుంచి కందిపప్పు, రాగులను ప్రభుత్వం రాయితీ ద్వారా అందజేయడానికి సన్నద్ధం చేసింది. జూన్ నుంచి ప్రతి ఒక్కరికీ రేషన్ షాప్‌ల ద్వారా రాగులు, కందిపప్పు, బియ్యం, పంచదార క్రమం తప్పకుండా అందజేస్తాం.

టి.రంగారావు, పౌరసరఫరాల డిప్యూటీ తహశీల్దార్, సాలూరు


మాట్లాడుతున్న టిఆర్‌ఎఫ్ జిల్లా ఐ.రామకృష్ణ

ఆదివాసీ సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కురుపాం

ఈనెల 7న గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలో చేపట్టబోయే ఆదివాసీ ఆత్మగౌరవ సభ ర్యాలీను ఆదివాసీ నిరుద్యోగ యువతీ, యువకులు, ఆదివాసీ సంఘాలు ఉపాధ్యాయ సంఘాలు, తాజా, మాజీ ప్రజా ప్రతినిధులు అందరు కూడా పార్టీలకు అతీతంగా పాల్గొని జయప్రదం చేయాలని టిఆర్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఐ.రామకృష్ణ కోరారు. మండలంలోని మొండెంఖల్‌లో ఆదివాసీలతో శనివారం నిర్వహించిన సమావేశంలో సభ జయప్రదానికి తీసుకోవాల్సిన కార్యాచరణ రూపొందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన ఉపాధ్యాయ ఉద్యోగలు ప్రకటనలో గిరిజనులకు నష్టం కలుగుతుందని ఎన్నికల హామీ ప్రకారంగా ఆదివాసి బిడ్డలకు మెగా డిఎస్‌సిలో తీవ్ర నష్టం జరుగుతుందని 2025 డిఎస్‌సిలో ఏజెన్సీ పోస్టులు గాని తీస్తే రాబోయే 40 సంవత్సరాల వరకు పోస్టులు ఉండవని వీటన్నిటిపై ఆదివాసీల సభలో కార్యచరణ రూపొందిస్తామని పెద్ద ఎత్తున ఆదివాసులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఆదివాసి నాయకులు పాల్గొన్నారు.

ఉదయం ఎండ .. సాయంత్రం వాన

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని గత నాలుగు రోజులుగా వానలు కురుస్తూనే ఉన్నాయి. వాతావరణంలో మార్పులు కారణంగా ఉదయం పూట బాగా ఎండలు కాస్తున్నప్పటికీ సాయంత్రం వచ్చేసరికి అంతే స్థాయిలో వర్షం పడుతుండడంతో వ్యవసాయ పనులకు ఆటంకం కలుగుతుందని రైతులు చెబుతున్నారు. వానలు వల్ల వేసవి వేడి నుంచి ఉపశమనం కలుగుతున్నప్పటికీ మొక్కజొన్న రైతులకు చాలా ఇబ్బందులు తప్పడం లేదు. ఆరు బయట జొన్నలు ఆరపెట్టడానికి అవకాశం లేకపోవడంతో రంగు మారే ప్రమాదం ఉందని రైతుల వాపోతున్నారు.

గిరిజన గ్రామాల్లో స్ప్రేయింగ్

ప్రజాశక్తి- సీతంపేట

మండలంలో ధోనుభాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో జీ గుమ్మడ, గడిగుజ్జి, ఎస్ జయపురం, ఎంఎం గూడ తదితరు గ్రామాల్లో శనివారం సబ్ యూనిట్ అధికారి జె మోహన్‌రావు ఆధ్వర్యంలో మలతీయన్ పిచికారీ చేశారు. ఐఆర్‌ఎస్ ద్రావణం మిక్సింగ్ చేసి స్ప్రేయింగ్ చేస్తున్నామని దీనిని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మలేరియా సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి - కురుపాం

అర్హులైన లబ్ధిదారులు ఇంటి స్థలం కోసం సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తహశీల్దార్ ఎం.రవణమ్మ కోరారు. శనివారం స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడుతూ మండలంలో అన్ని గ్రామాల్లో నేటికీ ఇంటి స్థలం లేని వారు, ఇంతవరకు ఇంటి స్థలం మంజూరు కానటి వంటి అర్హులైన లబ్ధిదారులు వారి పరిధిలో గల సచివాలయంలో ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకోవాలని, ఈ అవకాశాన్ని అర్హులైన లబ్ధిదారులు వినియోగించుకోవాలని కోరారు.

విద్యార్థులకు పొదుపు కథలు

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిబిరంలో భాగంగా శనివారం విద్యార్థులకు రిటైర్డ్ టీచర్ మండల వెంకట రమణ పొదుపు కథలు, సామెతలు చెప్పారు. ముందుగా డ్రాయింగ్ మాష్టర్ గొర్లె మురళి పిల్లలకు కొన్ని రకాల పెన్సిళ్లను ఎలా ఉపయోగించాలో వివరించారు. ఇన్‌చార్జి గ్రంథాలయాధికారి గణేష్‌బాబు, సహాయకుడు ఈశ్వర్ పాల్గొన్నారు.

శిష్టకరణ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కోటేశ్వరరావు

ప్రజాశక్తి పాలకొండ

శిష్టకరణాల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా రుద్ర కోటేశ్వ రరావు ఎంపికయ్యారు. ఈ మేరకు ఆయనకు పాలకొండ శిష్టకరణ సంఘ ప్రతినిధులు అభినందనలు తెలిపారు. రుద్ర కోటేశ్వరరావు శిష్టకరణ సంక్షేమానికి ఎంతో కృషి చేస్తున్నారని, అలాంటి వ్యక్తికి పదవి రావడం సంతోషించ దగ్గర విషయమని అన్నారు. పాలకొండలో మరింత ఐక్యతగా ఉండి సంఘ అభివృద్ధికి పనిచేస్తామన్నారు. అభినందనలు తెలిపిన వారిలో సాహిని శ్రీనివాసరావు, బాసూర కాంతారావు, ఎవిఆర్ మూర్తి, పాలవలస రమేష్, కొట్టిశ శేఖర్ తదితరులు ఉన్నారు.

విద్యా హక్కు చట్టం నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - బలిజిపేట

ప్రైవేట్ , అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యా హక్కు చట్టం నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఎంఇఒ-1 సామల సింహాచలం అన్నారు. శనివారం తన కార్యాలయంలో మండలంలోని ప్రైవేట్ విద్యా సంస్థల ప్రిన్సిపాళ్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం నిబంధనలు ప్రకారం ప్రైవేట్ పాఠశాలలు, విద్యాసంస్థలు పూర్తి వివరాలు ఫారం-1లో పూర్తి చేసి వారి లాగిన్ ద్వారా తప్పనిసరిగా సబ్మిట్ చేయాలన్నారు. 12 (1) పి ప్రకారం పేద, బలహీన వర్గాల పిల్లలకు ఒకటో తరగతిలో 25 శాతం సీట్లకు ప్రవేశాలు ఉచితంగా కల్పించాలని అన్నారు. సమావేశంలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య ప్రతినిధులు దాసరి రమణ, చిట్టిబాబు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు : కమిషనర్

ప్రజాశక్తి -సాలూరు

పట్టణంలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని, ఈనెలలో జరగనున్న శ్యామలాంబ పండగ నేపథ్యంలో తాగునీటి సౌకర్యానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగుచర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ డిటివి కృష్ణారావు. వెల్లడించారు. మున్సిపల్ సిబ్బందితో కలిసి మంచినీటి కేంద్రాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈనెలలో నిర్వహించనున్న శ్యామలాంబ పండగ నేపథ్యంలో పట్టణ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని సిబ్బందికి తగు సూచించారు.

సేవారత్న పురస్కారానికి కోడూరు ఎంపిక

ప్రజాశక్తి -సాలూరు

ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలకు డాక్టర్ కోడూరు సాయిశ్రీనివాసరావును ఆహ్వానించారు. ఈనెల 10,11, తేదీల్లో ఏలూరు, మహాలక్ష్మి గోపాలస్వామి కళ్యాణ మండపంలో రెండురోజులు నిర్వహించే ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలు శ్రీశ్రీ కళావేదిక సాహితీ పట్టాభిషేక మహోత్సవాలు జరగనున్నాయి. ప్రపంచ కవితోత్సవం, సాహిత్య సదస్సులు, కళా ప్రదర్శనలు. పుస్తకావిష్కరణ కార్యక్రమంలో వివిధ రంగాల్లో కృషిచేసిన వారికి తెలుగు కీర్తి, కవి రత్న, సేవారత్న అవార్డులతో సత్కరించనున్నారు..శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో అంతర్జాతీయ సిఇఒ కత్తిమండ ప్రతాప్. సారధ్యంలో జరుగనున్న బంగారు నంది అవార్డు గ్రహీత డాక్టర్ కోడూరు సాయిశ్రీనివాసరావు. సేవా రంగం నుండచి ఎంపికచేసి సేవా రత్న అవార్డుతో సత్కరించనున్నారు. ఈ సందర్భంగా కోడూరు సాయి శ్రీనివాసరావు మాట్లాడుతూ సేవారంగం నుంచి తనను ఎంపిక చేసి, సేవారత్న అవార్డుతో సత్కరించడం ఎంతో ఆనందంగా ఉందని, సామజిక సేవపట్ల మరింత బాధ్యత పెరిగిందని అన్నారు. స్థానిక పెద్దలు, సాలూరు ప్రాణదాత అధ్యక్షులు డాక్టర్ వాడాడ గణేశ్వరరావు, డాక్టర్ మోహనరావు డిప్యూటీ డిఇఒ రాజకుమార్. ఎఇఒలు వెంకటరావు, మొయిద కృష్ణారావు అభినందనలు తెలిపారు.

దాడి దుర్మార్గమైన చర్య

ప్రజాశక్తి- పాలకొండ

విజయనగరం జిల్లా వంగర మండలానికి చెందిన ఎంపిటిసి కరణం సుదర్శనరావుపై దాడి దుర్మార్గమైన చర్య అని వైసిపి పెన్షనర్ల ఉద్యోగుల విభాగం మన్యం జిల్లా అధ్యక్షులు ఎద్దు లిల్లీ పుష్పనాథం అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సుదర్శన్‌రావుపై హత్యాయత్నం చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి దాడులు జరగడం బాధాకరమన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో దాడులు పెరిగాయన్నారు. ఇలాంటి హత్యా రాజకీయాలు మానుకోవాలని, లేకుంటే ప్రజలే బుద్ధి చెప్పే రోజులు వస్తాయని అన్నారు. ఇలాంటి రాజకీయ కక్షలు, దాడులు జరగకుండా పోలీస్ యంత్రాంగం దృష్టి పెట్టాలన్నారు.

ప్రమాదకరంగా డివైడర్లు

◆రాత్రి పూట కనిపించకపోవడంతో ప్రమాదాలు ◆గాయాలు పాలవుతున్న వాహనదారులు ◆డివైడర్లకు రంగులు వేయాలని కోరుతున్న ప్రయాణికులు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రమైన వీరఘట్టంలోని ప్రధాన రహదారిలో ఏర్పాటు చేసిన డివైడర్ ప్రమాదకరంగా మారింది. ప్రధాన రహదారి విస్తీర్ణ అభివృద్ధి పనుల్లో భాగంగా గత ప్రభుత్వంలో ఒట్టిగెడ్డ వంతెన నుంచి స్వామి థియేటర్ వరకు 1.2 కిలోమీటర్ పరిధిలో ఉపాధి హామీ నిధులు రూ 5.5 కోట్లతో ఐటిడిఎ పర్యవేక్షణలో రహదారితో పాటు మధ్యలో డివైడర్ పనులు కూడా చేపట్టారు. ఈ పనులు చేసేటప్పుడు అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో గుత్తేదారు


రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా ఉన్న డివైడర్‌ను ఢీ కొన్న లారీ(ఫైల్)

ఇష్టానుసారంగా పనులు చేపట్టారు. దీంతో డివైడర్ మూడు రోజులు ముచ్చటగానే మారింది. రహదారి నిర్మాణ పనులు పూర్తయినప్పటికీ మధ్యలో ఏర్పాటు చేసిన డివైడర్‌కు ఎటువంటి రంగులు వేయకపోవడంతో అవి ప్రమాదాలకు దారి తీస్తున్నాయని స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు. రాత్రి సమయాల్లో వీటి ఆనవాలు కనిపించకపోవడంతో డివైడర్‌ను వాహనాలు ఢీకొని ప్రయాణికులు ప్రమాదాల బారినపడుతున్నారు. 2023 డిసెంబర్ 1న పార్వతీపురం నుంచి వీరఘట్టం వైపు వస్తున్న లారీ మిత్ర జంక్షన్ వద్ద డివైడర్‌కు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణహాని జరగలేదు. లారీ మాత్రం మరమ్మతులకు గురైంది. 2024 ఆగస్టు 21న పాలకొండ నుండి వీరఘట్టం వైపు వస్తున్న కారు ప్రియాంక పిల్లింగ్ స్టేషన్ వద్దగల డివైడర్‌ను ఢీకొనడంతో పలువురు గాయపడగా, కారు మరమ్మతులకు గురైంది. 2024 డిసెంబర్ 11న తెలగవీధి జంక్షన్ వద్ద గల డివైడర్‌ను కారు ఢీకొట్టడంతో వాహనం నడిపే వీరఘట్టం తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ తలకు


డివైడర్‌ను ఢీ కొని దెబ్బ తిన్న కారు(ఫైల్)


రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా ఉన్న డివైడర్

తీవ్రగాయమైంది. రాత్రి సమయంలో డివైడర్లు కనిపించకపోవడంతో తరచుగా ఇలా ప్రమాదాలు సంభవిస్తున్నాయి. వీటిని ఇలాగే విడిచిపెడితే మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి మధ్యలో ఏర్పాటు చేసిన డివైడర్‌కు రంగులు వేయడంతో పాటు ప్రమాదాలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మలేరియా ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గిరిజన గ్రామాల్లో మలేరియా ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు వైద్యాధికారులకు, సిబ్బందికి సూచించారు. తాడికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గుమ్మలో స్ప్రేయింగ్‌ను జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావుతో కలిసి శనివారం తనిఖీ చేశారు. పిహెచ్‌సిలో వైద్య సేవలపై ఆరా తీసి సిబ్బందితో సమీక్ష జరిపారు. దోమల నివారణకు చేపడుతున్న ఐఆర్‌ఎస్ స్ప్రేయింగ్ గ్రామాల్లో పూర్తి స్థాయిలో జరిగేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. స్ప్రేయింగ్ జరగబోయే గ్రామాలను సబ్ యూనిట్ అధికారులు ముందస్తుగా తెలియజేసి కచ్చితంగా నిర్వహించాలని, ఐఆర్‌ఎస్ నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. క్షేత్ర స్థాయిలో ఫీవర్ సర్వే పక్కాగా చేపట్టి జ్వరాలు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఆసుపత్రిలో సిబ్బంది అన్ని వేళలా అందుబాటులో ఉంటూ రోగులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. వైద్య సేవలపై రోగుల అభిప్రాయాలను వారిచే స్వీకరించాలన్నారు. గుమ్మలో ఐఆర్‌ఎస్ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఇంటింటికీ దోమల మందు పిచికారీ చేస్తున్న తీరును గమనించి

డిఎంహెచ్‌ఒ భాస్కరరావు
తాడికొండ పిహెచ్‌సి, ఐఆర్‌ఎస్ స్ప్రేయింగ్ తనిఖీ


స్ప్రేయింగ్‌ను పరిశీలిస్తున్న డిఎంహెచ్‌ఒ భాస్కరరావు

కొంత అసంతృప్తి వ్యక్తం చేశారు. స్ప్రే చేసిన ఇళ్లకు మార్కింగ్ పక్కాగా ఉండాలన్నారు. ఐఆర్‌ఎస్‌కు వినియోగమవుతున్న ఎసిఎం5 శాతం మోతాదుపై సబ్ యూనిట్ అధికారులను ఆరా తీశారు. స్ప్రే చేస్తున్న సిబ్బంది మాస్క్, కళ్లజోళ్లు, చేతి తొడుగులు తప్పక ధరించాలన్నారు. ఐఆర్‌ఎస్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం డాక్టర్ భాస్కరరావు గుమ్మలో గ్రామీణ ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. మందుల లభ్యత పరిశీలించి ప్రతి రోజూ హెల్త్ వెల్నెస్ కేంద్రంలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారులు డాక్టర్ ఎం.బుద్ధేశ్వ రరావు, డాక్టర్ పి.అభిలాష్, సిహెచ్‌ఒ పద్మ, సబ్ యూనిట్ అధికారి మోహనరావు, పాల్గొన్నారు.

కురుపాం : గిరిజన గ్రామాల్లో ఐఆర్‌ఎస్ స్ప్రేయింగ్ పూర్తిస్థాయిలో జరిగేలా చర్యలో చేపట్టి మలేరియా ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. భాస్కరరావు అన్నారు. మండలంలోని మొండెంఖల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో గల గుమ్మలో జరుగుతున్న స్ప్రేయింగ్‌ను కలిసి తనిఖీ చేశారు. అనంతరం గుమ్మలో గ్రామీణ ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి మందుల లభ్యత పరిశీలించి ప్రతీ రోజూ హెల్త్ వెల్నెస్ కేంద్రంలో సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారులు డాక్టర్ ఎం.బుద్ధేశ్వరరావు, డాక్టర్ పి.అభిలాష్, సిహెచ్‌ఒ పద్మ, సబ్ యూనిట్ అధికారి మోహనరావు, హెల్త్ సూపర్వైజర్ భారతి, ఎఎన్‌ఎం భాగ్య, హెల్త్ అసిస్టెంట్ ఆనంద్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ

సిసి రోడ్లు పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని దయానిదిపురం పరిధిలో జరిగిన సీసీ రోడ్డు పనులను ఎంపిడిఒ టి. త్రివిక్రమరావు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌ఆర్‌ఇజిఎస్ కింద మంజూరైన అన్ని పనులు పూర్తి చేయాలన్నారు. పనుల్లో ఎక్కడా నాణ్యతలోపాలు కనిపించకూడదన్నారు. పనులు వేగవంతం చేసి నివేధికలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ టి రామారావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అభివృద్ధి చేస్తే ఆదాయమే..

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలోని స్వామి థియేటర్‌కు ఆనుకొని ఉన్న కోనేటి చెరువు అభివృద్ధి చేస్తే పంచాయతీకి ఆదాయం లభిస్తుందని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కోనేటి చెరువు చుట్టూ ఉన్న గట్టును చదును చేస్తే అందమైన మొక్కలు నాటడంతో పాటు వ్యాయామానికి కూడా ఎంతో అనువుగా ఉంటుందని, చిరు వ్యాపారులకు కొంతమేర జీవనోపాధి దొరుకుతుందని ఆ దిశగా మేజర్ పంచాయతీ అధికారులు చర్యలు తీసుకుని కోనేటి చెరువు అభివృద్ధికి తోడ్పడాలని స్థానికులు కోరుతున్నారు. కోనేటి చెరువు సుమారు 70 సెంట్లు పైబడి విస్తీర్ణం ఉంటుందని ఏటా ఉపాధి హామీ పథకం ద్వారా చెరువులో ఉపాధి పనులు చేస్తున్నారని, ఉపాధితో పాటు మేజర్ పంచాయతీ కూడా సహకారం అందిస్తే కోనేటి చెరువులో బోటు షికారు ఏర్పాటు చేయవచ్చునని అభిప్రాయ పడుతున్నారు. ప్రధాన రహదారికి చెరువు పక్కన ఉన్నందున పర్యాటకులకు ఎంతగానో ఉపయోగపడుతుందని, స్థానికుల అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కోనేటి చెరువు అభివృద్ధి పనులు చేపడితే కొంతమేర ఆక్రమణ కూడా తొలగించవచ్చని, ప్రస్తుతం ఈ చెరువు ఆక్రమ దారుల బంధకంలో చిక్కుకొని ఉందని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా మేజర్ పంచాయతీ అధికారులు స్పందించి చెరువు గర్భం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఒడిశా పథకాలు తిరస్కరించిన కొటియా వాసులు

ప్రజాశక్తి - సాలూరు

వివాదాస్పద కొటియా గ్రామాల ప్రజలు ఒడిశా ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను తిరస్కరించారు. రేషన్ సరుకులు, పింఛన్లను కొటియా గ్రామాలైన దూళిభద్ర, దిగువ శెంబి, ఎగువ శెంబి, పణుకులోవ గిరిజనులు ఒడిశా ప్రభుత్వం అందించే పింఛను, రేషన్ సరుకులను తిరస్కరించినట్లు గిరిజన నాయకుడు సుబ్బారావు చెప్పారు. ఒడిశా రేషన్ కార్డులు, ఆధార్ కార్డులను సరెండర్ చేస్తామని, ఆంధ్రా లోనే కొనసాగుతామని గత కొంతకాలంగా ఈ గ్రామాల గిరిజనులు వాదిస్తున్నారు. ఒడిశా అధికారులు, పోలీసుల వేధింపులు తాళలేక ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలిపారు.



పిల్లలు కోసం ఏర్పాటు చేసిన పార్కు

ఏజెన్సీలో పర్యాటక అభివృద్ధి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

అందం.. ఆహ్లాదంతో గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీ ప్రాంతంలో పర్యాటక అభివృద్ధి సంతరించుకుంటుంది. ఎల్విన్ పేట పంచాయతీ సవరకోటపాడు ఉద్యానవన పర్యాటక కేంద్రం అభివృద్ధి దిశగా అడుగులు వేస్తుంది. 43 ఎకరాల్లో ఉన్న ఉద్యానవన కేంద్రంలో ఈ ప్రాంతానికి వచ్చే పర్యాటకుల కోసం గెస్ట్ హౌస్, బోటు షికారు, చిన్నపిల్లల కోసం జారుడు బల్ల, ఉయ్యాల వంటివి ఏర్పాటు చేశారు. కేంద్రంలో అల్లూరి విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఉద్యానవన పర్యాటక కేంద్రాన్ని మరింత అభివృద్ధి చేయాల్సి ఉందని భద్రగిరి ఐటిడిఎ ఇంజనీరింగ్ శాఖ అధికారులు తెలిపారు.

నవధాన్యాలతో రైతుకు మేలు

ప్రజాశక్తి- సీతానగరం

నవధాన్యంతో రైతుకు ఎంతో మేలు జరుగుతోందని, మండలంలోని గుచ్చిమి ఆర్‌ఎస్‌కె యూనిట్‌లో నవధాన్య కిట్లు తయారు చేస్తున్నామని ఎఒ అవినాష్ తెలిపారు. ఈ మేరకు శనివారం రైతులకు కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప్పు ధాన్యాలు పెసలు, మినుములు, నూనె గింజలు ఆముదం, నువ్వులు, దుంప జాతి ముల్లంగి, తీగ జాతి బీర చిక్కుడు, ఆనప, ఆకుకూరలు తోటకూర, గోంగూర, కాయగూరలు బెండ, సుగంధ ద్రవ్యాలు ఆవాలు, మెంతులు చిరుధాన్యాలు రాగి, సామలు, కొర్రలు, ఊదలు, తెల్ల జొన్న, మొక్కజొన్న 25 రకాలు నాలుగు కేజీలు కిట్లు 150 రూపాయలు చొప్పున అమ్ముతున్నామన్నారు. పలు పంటలు సాగు వల్ల అదనపు ఆదాయంతో పాటు నేలకు మేలు జరుగుతోందన్నారు. నేలలో సేంద్రియ కర్బనం శాతం పెరుగుతుందని ప్రధాన పంటలో రసాయన ఎరువులు వినియోగం తగ్గుతుందని చెప్పారు. పంటలో చీడపీడలు తెగుళ్లను తట్టుకునే సామర్థ్యం పెరిగి దిగుబడులు పెరుగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో గుచ్చిమి ఆర్‌ఎస్‌కె ఇంచార్జ్ ప్రణీత్, రైతులు పాల్గొన్నారు.

నవ ధాన్యాలు కిట్లు పంపిణీ

గుమ్మలక్ష్మీపురం : జియ్యమ్మవలస మండలంలోని బిత్తర పాడు, అల్లువాడ రైతు సేవా కేంద్రాలలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు నవధాన్య కిట్లును ఎంపిపి బొంగు సురేష్ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ వర్షాలు అనుకూలంగా పడుతుండటం వల్ల రైతులు అదును మీద నవధాన్యాలు చెల్లుకోవాలన్నారు. మండలంలోని అన్ని గ్రామాలలో రైతులు నవధాన్యాలు వేసుకోవాలని సూచించారు. రీజనల్ టెక్నికల్ అధికారి జి.హేమసుందర్ మాట్లాడుతూ రీజనల్ పరిధిలోని అన్ని


సీతానగరం: నవధాన్యం కిట్లను అందిస్తున్న ఎఒ అవినాష్

జిల్లాలలో యుద్ధ ప్రాతిపదికన నవధాన్యాల కిట్లను కార్యకర్తలు ఒక బృహత్తర కార్యక్రమంగా నిర్వహిస్తున్నామన్నారు. స్టేట్ రిసోర్స్ పర్సన్ (ఎస్‌ఆర్‌పి) పి.దేవుళ్ళు మాట్లాడుతూ వరి, పత్తి వంటి పంటలు విస్తీర్ణం తగ్గించి, చిరుధాన్యాలు రాగులు, కొర్రలు, సామలు, ఊదలు, ఆరికలు, జొన్నలు వేసుకోవడం వల్ల ఖర్చులు తగ్గి దిగుబడులు పెరుగుతాయన్నారు. కార్యక్ర మంలో ఎఒ జ్యోత్స్న, విఎఎ ఎం.రమ్య, ఎన్‌ఎఫ్‌ఎ జి. అన్నపూర్ణ, మాస్టర్ ట్రైనర్ బి .శ్రీరామ్, సిబ్బంది ఏ.సూర్యనా, సిహెచ్. లక్ష్మణ, కే. రామకృష్ణ, బి .ధనుంజయరావు రైతులు, పాల్గొన్నారు.

అత్యవసర సమయంలో సంప్రదించండి

సీతంపేట: అత్యవస సమయాల్లో తమను సంప్రదించేందుకు ప్రతి ఒక్కరూ వారి సెల్‌ఫోన్‌లో అగ్నిమాపక కేంద్రం, పాలకొండ నెంబర్లను 08941 260111, 95539 18425 సేవ్ చేసి ఉంచుకోవాలని, ఏదైనా ప్రమాదం సంభవించిన త్వరితగతిన సంప్రదించాలని అగ్నిమాపక అధికారి జె.సర్వేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. వాణిజ్య సముదాయాలు నిర్మాణ సమయంలో నిర్మాణానికి, నిర్మాణానికి మధ్యన అగ్నిమాపక వాహనం తిరిగే విధంగా ఖాళీ స్థలం విడిచిపెట్టి నిర్మాణాలు చేయాలని కోరారు. ఇండియన్ స్టాండర్డ్స్ ఇన్స్టిట్యూట్ కలిగిన విద్యుత్ ఉపకరణాలు, విద్యుత్ వైరింగ్ ఉపయోగించాలని, రోడ్లలను, పరిసరాలను శుభ్రంగా ఉంచమని అంతర్జాతీయ అగ్నిమాపక యోధుల దినోత్సవం సందర్భంగా ప్రజలకు తెలిపారు.

ఆధునిక వ్యవసాయంపై దృష్టిసారించాలి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

ప్రస్తుత పరిస్థితుల్లో రైతుల ఆధునిక, ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని, అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకొని పంటల్లో అధిక దిగుబడులు సాధించాలని రస్తాకుంటు బాయి సమన్వయకర్త డాక్టర్ ఎస్.ధ్రువ అన్నారు. మండలంలోని గిజబలో శనివారం రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శాస్త్రవేత్తల సూచనలను, సలహాలను రైతులు తమ పంటలపై ఆచరించాలని, వ్యవసాయ విద్యార్థులు గ్రామీణ పంటల సాగు పద్ధతులపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. రైతులు పండించిన పంటల్లో వచ్చే సమస్యలను గుర్తించి పరిష్కరించాలని తెలిపారు. నవధాన్య విత్తనాలు, పచ్చిరొట్ట ఎరువులు వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. అసోసియేట్ డాక్టర్ ఎం భరతలక్ష్మి మాట్లాడుతూ రైతులకు ఎగుమతి అనుకూలంగా ఉన్న పంటలు పండిస్తే అధిక లాభాలు పొందవచ్చుని, ఆధునిక వ్యవసాయ పరికరాలతో నూతన విధానంలో పంటలు సాగు చేపట్టాలని సూచించారు. అరటి, వరిలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు గురించి తెలిపారు. సీతంపేట అగ్రికల్చర్ రిజిస్ట్రేషన్ వ్యవసాయ విస్తరణ విభాగ శాస్త్రవేత్త డాక్టర్ల లక్ష్మీనారాయణ అరటి, వరిలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు గురించి తెలిపారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన ప్రదర్శనలు, గ్రోమోర్ కంపెనీ సిబ్బంది సందర్శనకు ఉంచిన పలు రకాల ఎరువులు, పురుగులు మందులు గురించి సూచించారు. కార్యక్రమంలో నైరా వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ వై. రాజశేఖర్ వ్యవసాయ శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం. అనంత్ విహారి, డాక్టర్ ఎం.స్రవంతి, డాక్టర్ అమృతవీణ, ఎంపిటిసి సభ్యులు ఎం.సింహాచలం, జట్టు ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్. ప్రహరాజు, రైతులు పాల్గొన్నారు.

ఆయుర్వేదంతో దీర్ఘకాలిక వ్యాధులు నయం

ప్రజాశక్తి- సీతానగరం

దీర్ఘకాలికంగా ఉన్న పలు రుగ్మతలకు ఆయుర్వేదంతో మంచి ఫలితాలు ఉంటాయని బూర్జ ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ టి. హేమాక్షి అన్నారు. చెల్లంనాయుడువలస గ్రామంలో శనివారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పలు అనారోగ్య లక్షణాలు, సమస్యలతో శిబిరానికి వచ్చిన గ్రామస్తులకు డాక్టర్ హేమాక్షి ఆరోగ్య తనిఖీలు చేపట్టారు. రోగులతో మాట్లాడి వారి సమస్యలను స్పష్టంగా తెలుసుకున్నారు. ముఖ్యంగా వాత వ్యాదులు, జీర్ణ సంబంధిత సమస్యలు, కీళ్ల నొప్పులు, శ్వాసకోశ రుగ్మతలు, స్త్రీలకు సంబంధించిన వ్యాదులు, చర్మ సంబంధిత సమస్యలు, వేసవిలో ప్రబలే సమస్యలకు ఆయుర్వేద



పిల్లలను తనిఖీ చేస్తున్న డాక్టర్ హేమాక్షి

మందులు అందజేశారు. వృద్ధులు, మధ్య వయస్కులు, పిల్లలు శిబిరాన్ని ఎక్కువగా వినియోగించుకున్నారు. మందులు వినియోగించే విధానాన్ని వారికి క్షుణ్ణంగా వివరించారు. డాక్టర్ హేమాక్షి మాట్లాడుతూ మన పరిసరాల్లో అనేక ఆయుర్వేద ఔషధ గుణాలున్న మొక్కలు ఉన్నాయని ప్రాచీన కాలం నుండి మన ఆయుర్వేద వైద్య విధానానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని దీర్ఘకాలికంగా ఇబ్బంది పెడుతున్న పలు రుగ్మతలకు ఆయుర్వేదంతో ఉపశమనం కలుగుతుందని చెప్పారు. అనంతరం వేసవి జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ ఏఎన్ఎం పద్మ, ఫార్మాసిస్ట్ హైమ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని గొయిది పంచాయతీలో పారిశుధ్యం, ఇతర మౌలిక వసతుల కల్పిస్తూ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నారని పంచాయతీ కార్యదర్శి సుదర్శనరావు అన్నారు. ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ ఈపంచాయతీ పరిధిలో పత్తికగూడ, రసూల్‌పేట, సవర గొయిది, కిట్టలపాడు, కొండపేట, జక్కరవలస తదితర గ్రామాల్లో 788 జనాభా ఉన్నారు. ట్రై సైకిల్ ద్వారా చెత్త కలెక్షన్ వాహనం ద్వారా ఇంటింటికి వెళ్లి చెత్త సేకరించి వర్మీకంపోస్ట్ 300 కేజీలపైగా తయారు చేశామన్నారు. చెత్త సంపద కేంద్రానికి రూ.50 వేలుతో ముఖద్వారం నిర్మించామని తెలిపారు. జక్కర వలసలో రూ.2లక్షల 30 వేలతో రచ్చబండ నిర్మించామని తెలిపారు. సవర గోయిదిలో 25 వేలుతో కొత్త మోటర్ కొనుగోలు చేసి గ్రామస్తులకు నీరు అందిస్తున్నామని తెలిపారు. పంచాయతీలో 305 గృహాలకు ఇంటి పన్ను వసూలు చేశామని చెప్పారు. రూ.20వేలతో ఎల్ఇడి లైట్లు కొనుగోలు చేసి గ్రామాల్లో వీధి దీపాలతో వెలుగులు నింపుతున్నామని అన్నారు. క్లాప్ మిత్రులకు ప్రతినెలా సకాలంలో జీతాలు చెల్లిస్తున్నామని, ఇంతవరకు పెండింగ్ లేదని అన్నారు.


చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిఎల్‌పిఒ, పంచాయతీ కార్యదర్శి